సాక్షి
మహబూబాబాద్
శనివారం । 13 । జూలై । 2024



ఏడు దీవుల లక్నవరం
గోవిందరావుపేటలోని లక్నవరం సరస్సులోని ఏడు దీవుల్లో ఇప్పటికే మూడు దీవులు పర్యాటకులకు అందుబాటులో ఉండగా.. మిగతా దీవుల్లో పనులు కొనసాగుతున్నాయి. - 8లో▸



అండగా ఉంటాం..
తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరైన పిల్లలకు అండగా ఉంటామని, అధైర్యపడొద్దని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
38.2°/23.3°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కర్నెగండిలో వైద్య శిబిరం



కొత్తగూడ: మండలంలోని కర్నెగండి గ్రామంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో 'మంచం పట్టిన ఏజెన్సీ' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈమేరకు కోమట్లగూడెం పీహెచ్‌సీ సిబ్బంది కర్నెగండి గ్రామంలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి మురళి మాట్లాడుతూ.. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా ఇంటి చుట్టూ ఉన్న కలుపు మొక్కలను తొలగించి, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. వర్షాకాలంలో నీరు కలుషితం కావడం, దోమలు కుట్టడం వల్ల ఇలాంటి వైరల్ జ్వరాలు వస్తాయని వివరించారు. అందరికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మరో రెండురోజులు వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

నేటి నుంచి ప్యాసింజర్ రైలు పునఃప్రారంభం

దోర్నకల్: భద్రాచలం రోడ్ –విజయవాడ ప్యాసింజర్ రైలు శనివారం నుంచి పునఃప్రారంభం కానుంది. పలు కారణాలతో కొన్ని రోజుల క్రితం రైలును రద్దు చేశారు. కాగా ప్యాసింజర్ రైలును పునఃప్రారంభించడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా విజయవాడ మార్గంలో పలు పనులు జరుగుతున్న నేపథ్యంలో రైలు మళ్లీ ఆగస్టు 2నుంచి 10వ తేదీ వరకు రద్దు కానుంది.

డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా రాజు బాధ్యతలు



కేసముద్రం: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసి డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం మహబూబాబాద్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. ప్రిన్సిపాల్ రాజు మాట్లాడుతూ.. ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభమయ్యే డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ(ఎంపీసీ, బీజెడ్‌సీ) గ్రూపుల్లో విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మహబూబాబాద్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ ద్వారా కూడా ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కేసముద్రం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల (2024–25 విద్యాసంవత్సరం) నియామకం కోసం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిస్టరీ, ఎకనామిక్స్, కామర్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ సబ్జెక్ట్‌లో పోస్టులున్నాయన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 16వ తేదీలోగా మహబూబాబాద్‌లోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమర్పించాలన్నారు. ఈనెల 19న ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విప్రచిత్తా, మహా వజ్రేశ్వరి క్రమాల్లో అమ్మవారు





హన్మకొండ కల్చరల్: భద్రకాళి ఆలయంలో కొనసాగుతున్న శాకంబరీ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏడో రోజు శుక్రవారం అమ్మవారికి విప్రచిత్తా, మహా వజ్రేశ్వరీ క్రమాల్లో పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు ఉదయం సుప్రభాతసేవ నిత్యాహ్నికం, చతుస్థానార్చనలు జరిపారు. అనంతరం అమ్మవారి స్నపనమూర్తిని కాళీక్రమమైన విప్రచిత్తా క్రమంలో, అమ్మవారి భోగబేరాన్ని షోడశీక్రమంలో మహా వజ్రేశ్వరిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

మత్తు వదలాలని..!

గంజాయి, గుడుంబా నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమం

- గ్రామస్థాయిలో చైతన్యం కోసం ప్రయత్నాలు
- యువతకు ప్రోత్సాహం.. విద్యార్థులకు చేయూత
- మార్పుకోసం పోలీస్‌బాస్ నూతన వ్యూహం



గంగారం మండలంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేస్తున్న ఎస్పీ (ఫైల్)



సాక్షి, మహబూబాబాద్: నాటి తెలంగాణ సాయుధ పోరాటం నుంచి నేటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు.. భూమికోసం, భుక్తి కోసం జరిగిన అనేక పోరాటాల్లో మానుకోటకు ప్రత్యేక స్థానం ఉంది. ఇంతటి ఘన చరిత్ర ఉన్న జిల్లాను గంజాయి, గుండుబా పట్టిపీడిస్తోంది. ఒకప్పుడు రాష్ట్రంలోనే గంజాయి సాగుకు కేంద్ర బిందువుగా ఉన్న మానుకోట.. ప్రస్తుతం రవాణాకు అడ్డాగా మారింది. దీంతో పాటు గుండుబా తయారీ, అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అయితే జిల్లా ఎస్పీ రాంనాథ్ కేకన్ గంజాయి, గుడుంబా నిర్మూలనకు నూతన వ్యూహంతో ముందుకెళ్తున్నారు. జిల్లాకు పట్టిన మత్తు, బానిసైన యువతకు చికిత్స చేసేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు.

ప్రజలతో మమేకం..

జిల్లాలో గంజాయి, గుడుంబా కట్టడికి ఎస్పీ ప్రజల మధ్యకు వెళ్తున్నారు. స్థానికంగా ఉన్న సమస్యలపై ఆరా తీస్తున్నారు. దీనిలో భాగంగానే ఇప్పటి వరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పర్యటించారు. అంతటితో ఆగకుండా జిల్లాలోని మారుమూల అటవీ ప్రాంతాలు కొత్తగూడ, గంగారం, గూడూరు, బయ్యారం ప్రాంతాల్లో పర్యటించి ప్రజల అవసరాలు, వారి జీవన విధానం తెలుసుకున్నారు. ఆదివాసీ గూడేలు, గిరిజన తండాలకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు.

ప్రోత్సాహం..

ఏ సమస్య వచ్చినా.. పరిష్కారంలో యువత కీలక భూమిక పోషిస్తుంది. దీనిని గమనించిన ఎస్పీ యువతతో మమేకమవుతున్నారు. కొన్ని ప్రాంతాలను గుర్తించి అక్కడ యువతను కలిశారు. వారి అవసరాలు తెలుసుకున్నారు. చదువు, ఉద్యోగాలు,



యువతకు క్రికెట్ కిట్ అందజేస్తున్న ఎస్పీ(ఫైల్)

మెరుగైన జీవన విధానం గురించి చెప్పారు. ఇందుకు ఆయన జీవితమే ఉదాహరణగా చెప్పారు. యువత చెడు మార్గంలో వెళ్తే జరిగే అనర్థాలను వివరించారు. వారికి క్రికెట్, ఇతర క్రీడా పరికరాలు అందజేసి మంచి క్రీడాకారులుగా ఎదగాలని, ఉద్యోగాల్లో స్థిరపడాలని హితవు పలికారు. అదేవిధంగా స్కూల్ పిల్లలతో కలిసి భోజనం చేయడం, వారికి బ్యాగులు, పుస్తకాలు అందజేసి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి పిల్లల భవిష్యత్ గురించి వివరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిస కావొద్దని సూచించారు. సరఫరా చేస్తున్న వారిలో కొందరిని అదుపులోకి తీసుకొని హెచ్చరించారు. కొందరిపై కేసులు కూడా పెట్టారు. జిల్లాకు చెడ్డపేరు తెస్తున్న గుడుంబా, గంజాయి రవాణా, మత్తు పదార్థాల అమ్మకాలను నిషేధించాలని, ఇందుకు అందరి సహకారం కావాలని.. ఎక్కడ ఏం జరిగినా సమాచారం ఇవ్వాలని కోరారు. గుడుంబా రహిత గ్రామాలుగా తయారు చేసేందుకు కృషి చేస్తామని పలు గ్రామాల ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

నిర్మూలన కార్యక్రమాలు..

ప్రజలతో ఎస్పీ మమేకమవ్వడమే కాకుండా జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని మొత్తం అప్రమత్తం చేశారు. ప్రజలకు దగ్గర కావాలని చెప్పారు. రౌడీ షీటర్లను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించి సన్మార్గంలో నడవాలని సూచించారు. దీంతో ఏర్పడిన పరిచయాలతో ఏజెన్సీ ప్రాంతాలు, ఆదివాసీ గూడేలు, గిరిజన తండాల్లో గుడుంబా నిర్మూలించాని, అందుకు అందరి సహకారం కావాలని కోరారు. దీంతో పోలీసుల తనిఖీలు, స్థానికుల సహకారంతో ఇప్పటి వరకు జిల్లాలోని సుమారు రూ.10కోట్లు విలువచేసే నల్లబెల్లం, పానకం, పటిక, గంజాయి, మద్యంతో పాటు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్నారు. అంతే కాకుండా బెల్లం, గంజాయి రవాణా చేస్తున్న వారిని శిక్షించే విషయంలో ప్రజాప్రతినిధులు అడ్డు రావొద్దని ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులను కోరినట్లు సమాచారం. అదేవిధంగా పోలీస్, ఎక్సైజ్‌శాఖలోని కొందరు ఉద్యోగులు అక్రమార్కులకు ముందస్తు సమాచారం ఇస్తున్న విషయంపై పోలీస్ బాస్ సీరియస్‌గా ఉన్నట్లు ఆశాఖల్లో చర్చ.

పనిచేసే అధికారులే ఏజెన్సీకి రావాలి

మానుకోట జిల్లాలో కొత్తగూడ, గంగారం మండలాలు అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయని, పనిచేసే అధికారులే ఇక్కడికి రావాలని మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం కొత్తగూడలో నిర్వహించిన ప్రజా దర్బార్(గ్రీవెన్స్)లో కొత్తగూడ, గంగారం, గూడూరు, మానుకోట మండలాల ప్రజల నుంచి మంత్రి వినతులు స్వీకరించారు. వారి సమస్యలు విని పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. - కొత్తగూడ

- వివరాలు 8లో▸



దివ్యాంగురాలి నుంచి వినతిపత్రం తీసుకుంటున్న సీతక్క

సాగులో మెళకువలు పాటించాలి

- ముగిసిన మల్యాల జేవీఆర్ హెచ్ ఆర్‌ఎస్ జిల్లాస్థాయి సెమినార్



ఉద్యాన దర్శిని బుక్, ప్రశంస పత్రాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

మహబూబాబాద్ రూరల్: రైతులు పంటల సాగులో మెళకువలు పాటించాలని మల్యాల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్, డాక్టర్ జె.చీనానాయక్, పసుపు పరిశోధన స్థానం శాస్త్రవేత్త పి.శ్రీనివాస్, హైదారాబాద్ ఉద్యాన కళాశాల ప్రొఫెసర్ ఎ.లావణ్య అన్నారు. మల్యాల జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త, హెడ్ కె.భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల జిల్లాస్థాయి సెమినార్ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఉద్యాన యూనివర్సిటీ తరపున మరిన్ని సెమినార్లు నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. పసుపులో మేలైన వంగడాలు, ఎత్తుమడుల పద్ధతి, దనియాలు, మెంతుల సాగులో మెళకువలు గురించి వివరించారు. సమావేశం అనంతరం రైతులకు కూరగాయల విత్తనాలు, ఉద్యాన దర్శిని బుక్, ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి జె.మరియన్న, మల్యాల కేవీకే సమన్వయకర్త మాలతి, తొర్రూరు హార్టికల్చర్ ఆఫీసర్ సీహెచ్.రాకేష్, అభ్యుదయ రైతు జైపాల్ రెడ్డి, మల్యాల ఉద్యాన కళాశాల టీచింగ్ అసోసియేట్ అక్షిత, భావన, జిల్లా రైతులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న డీఈఓ రామారావు

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈఓ రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించి మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని ఉత్తమ మార్కులు సాధించేలా కృషి చేయాలన్నారు. పాఠశాలలో పరిశుభ్రత పాటించాలని, ఆవరణలో మొక్కలు నాటాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం సిరినాయక్, ఉపాధ్యాయులు వాసుదేవ్, భరత్ వ్యాస్, మాధవి, రామ్మోహన్ రావు, అశోక్ రెడ్డి, లత, శోభ, బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పోస్టు పెట్టలేదు

తొర్రూరు: పాలకుర్తి ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టలేదని, కేవలం పీఏ తీరును నిరసిస్తూ మాత్రమే పోస్టు చేశానని గిరిజన యువకుడు మాలోతు సురేశ్‌బాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని భోజ్యా తండా పంచాయతీ శివారు ఈదులకుంట తండాలో సమావేశం నిర్వహించారు. పాలకుర్తి ఎమ్మెల్యేపై తనకు గౌరవముందని, పీఏ వ్యవహార శైలి నచ్చకే వాట్సాప్ గ్రూపుల్లో వ్యతిరేక పోస్టు పెట్టానన్నారు. కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదుతో పోలీసులు ఈ వ్యవహారంలో జోక్యం చేసుకున్నారన్నారు. ఈ విషయం మీడియాలో వైరల్‌గా మారిన తరుణంలో ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి తనను పిలిపించి మాట్లాడారని అన్నారు. ఇబ్బంది కలిగించిన ఎస్సై, పీఏపై చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారన్నారు.



సురేశ్‌బాబును పరామర్శిస్తున్న యశస్వినిరెడ్డి

పరామర్శించిన ఎమ్మెల్యే..

మండలంలోని ఈదులకుంట తండాలో మాలోతు సురేశ్‌బాబును ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు శోభన్‌నాయక్, సురేష్‌నాయక్, జాటోతు రవినాయక్, అభిరామ్ నాయక్, కిషన్, సమ్మయ్య, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నిట్'లో ఇన్‌క్యామ్-24 సదస్సు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో శుక్రవారం ఇండియన్ కాన్ఫరెన్స్ ఆఫ్ అప్‌లైడ్ మెకానిక్స్(ఇన్‌క్యామ్)–24 సదస్సు నిట్ వరంగల్, ఇండియన్ సొసైటీ ఫర్ అప్‌లైడ్ మెకానిక్స్ సంయుక్తంగా ప్రారంభించారు. న్యూ ఎడ్యుకేషన్ పాలసీ వివిధ రంగాల్లో పరిశోధనకు తోడ్పడుతుందని, ఇన్‌క్యామ్–24 సదస్సు నూతన పరిశోధనలకు వేదికగా నిలవాలని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ ఆకాంక్షించారు. ఈసందర్భంగా సదస్సు సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో టెక్సాస్ ఏ అండ్ ఎం యూనివర్సిటీ యూఎస్‌ఏ ప్రొఫెసర్ జేఎన్.రెడ్డి, యూనివర్సిటీ ఆఫ్ మిసిసిప్పి ప్రొఫెసర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సు సావనీర్‌ను విడుదల చేస్తున్న నిట్ డైరెక్టర్, యూఎస్‌ఏ ప్రొఫెసర్లు

వైద్యుల కొరత..

- సరిపడా డాక్టర్లు లేక రోగులకు అందని వైద్యసేవలు
- గార్ల ఆస్పత్రిలో రాత్రి సమయంలో అందుబాటులో ఉండని వైద్యులు
- పోస్టులు భర్తీ చేయాలని ప్రజల డిమాండ్



గార్ల సీహెచ్‌సీ



గార్ల: గార్లలో సకల సౌకర్యాలతో ఆస్పత్రి నిర్మాణం చేపట్టారు. ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే విభాగం, ఆక్సిజన్ ప్లాంట్, ఎమర్జెన్సీ వార్డు, వెంటిలేటర్ బాక్స్‌లు, ఫొటోథెరపి బాక్స్, స్టెరిలైజర్ మిషన్, ఆక్సీకాన్సన్‌టేటర్ ఇలా అన్ని సౌకర్యాలతో 30 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టారు. అయితే సరిపడా వైద్యులు లేకపోవడంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు.

అప్‌గ్రేడ్..

రెండేళ్ల క్రితం గత ప్రభుత్వం సీహెచ్‌సీని వైద్య విధాన పరిషత్‌కు అప్‌గ్రేడ్ చేసింది. ఈమేరకు 10మంది స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా, నేటి వరకు ఇద్దరు డాక్టర్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 24గంటలు వైద్య సేవలు అందించాల్సి ఉండగా.. ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు మాత్రమే డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. రాత్రి సమయంలో రోడ్డు, రైలు ప్రమాదాలు జరిగి వైద్యం కోసం ఆస్పత్రికి వస్తే డాక్టర్లు ఉండరు. నర్సులు మాత్రమే అందుబాటులో ఉండి వైద్యం చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రి మెడికల్ కళాశాల పరిధిలోకి వెళ్లడంతో అక్కడ పనిచేసే ఆరుగురు స్పెషలిస్ట్ డాక్టర్లను డిప్యూటేషన్‌పై గార్ల సీహెచ్‌సీకి కేటాయించారు. అయితే ఈ స్పెషలిస్ట్ డాక్టర్లు రోజుకు ఇద్దరు చొప్పున వచ్చి రెండు గంటలు మాత్రమే విధులు నిర్వహించి వెళ్తుంటారు. దీంతో మండల ప్రజలకు సరైన వైద్యసేవలు అందకపోవడంతో ఖమ్మం, మహబూబాబాద్ పట్టణాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ స్పందించి గార్ల సీహెచ్‌సీకి రెగ్యులర్ డాక్టర్లను నియమించి, 24 గంటలు డ్యూటీలో డాక్టర్లు ఉండే విధంగా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రాత్రి సమయంలో డాక్టర్ ఉండడు



రోడ్డు ప్రమాదాలు, పాము, తేలు కాటుతో రాత్రి సమయంలో వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్తే డాక్టర్లు ఉండరు. నర్సులు మాత్రమే వచ్చిరాని వైద్యం చేసి మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేస్తారు. డాక్టర్ పోస్టులను భర్తీ చేసి, 24గంటలు డాక్టర్ అందుబాటులో ఉండేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి.
- కందునూరి శ్రీనివాసరావు, గార్ల

మహిళా డాక్టర్‌ను నియమించాలి



గార్ల ఆస్పత్రిలో మహిళా డాక్టర్ లేకపోవడంతో మహిళలు ఖమ్మం, మహబూబాబాద్ పట్టణాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. రూ.కోట్లు వెచ్చించి గార్లలో సీహెచ్‌సీ నిర్మించినా రోగులకు సరైన వైద్యం అందని ద్రాక్షగానే మారింది.
- గుండెబోయిన నాగమణి, గార్ల

సమస్యల పరిష్కారానికే విద్యుత్ కోర్టులు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ వేణుగోపాలాచారి

దోర్నకల్: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే లోకల్ విద్యుత్ కోర్టులు నిర్వహిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక చైర్‌పర్సన్ ఎన్వీ వేణుగోపాలాచారి తెలిపారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన లోకల్ విద్యుత్ కోర్టులో పలువురు విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో గాలులు, వర్షాలతో తరుచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలపై లోకల్ కోర్టుకు 12 ఫిర్యాదులు అందాయి.అనంతరం వేణుగోపాలాచారి మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది వినియోగదారుల సమస్యలపై సత్వరం స్పందించి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కురవి సబ్ డివిజన్ పరిదిలోని డోర్నకల్, కురవి, సీరోలు, గార్ల, కొత్తపేట సెక్షన్లలోని చేపట్టాల్సిన పనుల అంచనాలను ఏఈలు వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. కమిటీ సభ్యులు చరణ్‌దాస్, కె.రమేష్, మహేందర్, ఏడీఈ రమేష్, ఎస్ఏఓ సంతోష్‌కుమార్, ఏఈలు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

కేసముద్రం: ముదిరాజ్ కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ–ఏలో చేర్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి నీలం దుర్గేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ముదిరాజ్ మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండా ప్రకాశ్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేర్చాలంటూ వినతి పత్రాలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సూరయ్య, మండల అధ్యక్షుడు పిచ్చయ్య, శ్రీనివాస్, అశోక్, విజయేందర్, శ్రావణ్, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు, విద్యార్థులు



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మహబూబాబాద్: విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఈసందర్భంగా మధు మాట్లాడుతూ.. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం దారుణమన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. టౌన్ సీఐ పి.దేవేందర్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి విద్యార్థుల కలెక్టరేట్ ముట్టడిని భగ్నం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు గుగులోత్ సూర్య, సూర్యప్రకాశ్, జ్యోతి, సింహాద్రి, వీరేందర్, రాకేశ్, వంశీ, కల్యాణి, వివేక్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సన్న బియ్యం పేరుతో మోసం

కాజీపేట: తక్కువ ధరలకే సన్నబియ్యం విక్రయిస్తామంటూ కొంతమంది వ్యక్తులు రేషన్ బియ్యం అంటగట్టి పలువురి నుంచి డబ్బులు కాజేసిన ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ టాటా ఏస్ వాహనంలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు బీపీటీ సన్న రకం బియ్యం అంటూ 25 కిలోల బస్తాను చూపిస్తూ బియ్యాన్ని విక్రయించారు. సాధారణంగా మార్కెట్‌లో 25కిలోల సన్న బియ్యం బస్తా ప్రస్తుతం రూ.1,400 నుంచి రూ.1,500వరకు ఉంది. కానీ సదరు వ్యక్తులు రూ.1,000కే విక్రయించడంతో తక్కువ ధరకు వస్తుందని పలువురు ఎగబడి కొన్నారు. వారికి అనుమానం రాకుండా బియ్యం బస్తా పైభాగంలో ఉన్న బియ్యాన్ని చూపించి బురిడీ కొట్టించారు. తమ సెల్‌ఫోన్ నంబర్లను సైతం ఇచ్చి వారిని నమ్మించారు. బాధితులు ఇంట్లో బియ్యం బస్తా విప్పి చూడగా అందులోని పైభాగంలో మాత్రమే కొంతమేర సన్న బియ్యం ఉండగా కింద భాగమంతా రేషన్ బియ్యం ఉండడం చూసి కంగుతిన్నారు. దీంతో వారు ఇచ్చిన సెల్‌ఫోన్ నంబర్లకు కాల్ చేయగా.. స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయినట్లుగా గుర్తించి ఆవేదనకు గురై చేసేదిలేక మిన్నకుండిపోయారు.

'జెన్‌కో' అభ్యర్థులకు ప్రత్యేక బస్సులు

హన్మకొండ: హైదరాబాద్‌లో ఈ నెల 14న నిర్వహించే టీజీ జెన్‌కో అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంచనున్నట్లు ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు శుక్రవారం తెలిపారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి హత్య


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గీసుకొండ : గ్రేటర్ పరిధిలోని 16వ డివిజన్ జాన్‌పాక మాస్టర్‌జీ పాఠశాలకు వెళ్లే దారిలో నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద గుర్తుతెలియని వ్యక్తి(38) హత్యకు గురయ్యాడు. గీసుకొండ పోలీసుల కథనం ప్రకారం.. జాన్‌పాకలో బలగాని అనిల్ ఇంటి నిర్మాణం పనులను చేపడుతున్నాడు. ఇందులో భాగంగా ఇంటి ఎదుట ఇసుక కుప్పను పోసుకున్నాడు. అడ్డా కూలీగా ఉన్న ఓ వ్యక్తి ఇంటి పని నిమిత్తం వచ్చి వెళ్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం బలగాల అనిల్‌కు ఇసుక కుప్పలో కూలీ మృతదేహం కనపడటంతో పోలీసులకు సమాచారం అందించాడు. అతడిని గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి రాయితో తలపై మోది హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. మృతుడు ఆంధ్రా ప్రాంతానికి చెందిన వాడిగా భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని గీసుకొండ సీఐ బాబూలాల్ సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 85031, 87126 85240 సెల్‌నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. మృతుడి వివరాలు తెలిస్తే అతడిని హత్య చేసింది ఎవరో తెలుసుకోవచ్చని సీఐ తెలిపారు.

ఏడు దీవుల లక్నవరం

ఆహ్లాదాన్ని పంచుతున్న సరస్సు, పరిసరాలు

- పర్యాటకులకు అందుబాటులో మూడు దీవులు
- మిగతా దీవులపై కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- అటవీ శాఖ ఉద్యానవనంలో జింకలు, చిల్డ్రన్స్ పార్కుల ఏర్పాటు
- దృష్టి సారిస్తే టూరిజం సెంట్రల్ పాయింట్‌గా గుర్తింపు


లక్నవరం వ్యూ (ఫైల్)

గోవిందరావుపేట: ప్రకృతి సహజసిద్ధ సోయగం.. ఏడుదీవుల వరం.. ములుగు జిల్లా గోవిందరావుపేటలోని లక్నవరం. వరంగల్ – భూపాలపట్నం జాతీయ రహదారి 163 నుంచి బూస్సాపూర్ గ్రామం మీదుగా సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నవరం సరస్సు పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందింది. సరస్సులోని ఏడు దీవుల్లో ఇప్పటికే మూడు దీవులు పర్యాటకులకు అందుబాటులో ఉండగా.. మిగతా దీవుల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. రెండేళ్లకోసారి జరిగే మేడారం జాతర సమయంలో జంపన్నవాగులోకి లక్నవరం సరస్సు నీటినే వదులుతారు.

హరిత హోటళ్లు..

టూరిస్టులు ఉండటానికి సరస్సు మధ్యలో హరిత హోటళ్లు ఉన్నాయి. ప్రైవేట్ సదుపాయాలు కూడా ఉంటాయి. హరిత హోటళ్లలో డార్మిటరీ రూమ్స్ ఏసీ, నాన్ ఏసీ గదులు అందుబాటులో ఉంటాయి. గ్లాస్ రూమ్స్ కూడా ఉన్నాయి. ఈ గదుల వినియోగానికి ఒకరోజుకు రూ.2,000 నుంచి రూ.5,000 వరకు చెల్లించాల్సి ఉంటుంది. పర్యాటకుల తాకిడి ఎక్కువ ఉండడం వల్ల ఆన్‌లైన్ లో కూడా టికెట్స్ అందుబాటులో ఉంచారు. ఫుడ్ కోసం రెస్టారెంట్‌లు కూడా ఉన్నాయి. లక్నవరంలో మూడు దీవుల్లో ప్రస్తుతం పర్యాటకులకు ఈ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. మిగతా దీవుల్లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

ఆదాయం, ఆహ్లాదం..

వివిధ ప్రాంతాల నుంచి లక్నవరం వచ్చే పర్యాటకలకు మరింత ఆహ్లాదాన్ని, వన్య ప్రాణులను దగ్గర నుంచి చూసే అవకాశాన్ని కల్పించాలనే ఆలోచనతో అటవీ శాఖ అధికారులు చేసిన కార్యాచరణ అద్భుతం. 2019లో పునరావాస కేంద్రంతోపాటు అటవీ శాఖ ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో దుప్పుల పునరావాస కేంద్రం కింద అటవీ శాఖ అధికారులు 20దుప్పులు, జింకలకు పకడ్బందీ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పునరావాస పునరుత్పత్తి ఏర్పాటు చేశారు. అందుకు అణుగుణంగా లక్నవరం తరలివచ్చే వేలాది మంది పర్యాటకులను ఆకట్టుకునేందుకు అటవీ శాఖ ఉద్యానవనం పేరుతో అద్భుతమైన పార్కును తీర్చిదిద్దారు. ఇందులో రూ.7.50లక్షల ఎంపీ నిధులతో చిల్డ్రన్స్ పార్కును సైతం ఏర్పాటు చేశారు. ఈ ఉద్యానవనం సందర్శించేందుకు పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20 టికెట్ ఏర్పాటు చేసి ఆ నిధులతో మెయింటెన్స్ చేసేందుకు కార్యాచరణ రూపొందించారు.

మనసు దోచే ఊయల వంతెన..

లక్నవరం సరస్సు అందాలు చూడాలన్నా.. వర్ణించాలన్నా.. ఒక్కసారైనా పర్యటించాల్సిందే.. సరస్సు నీటిలో తేలియాడుతున్నట్లుగా ఊయల వంతెన పై నడుస్తూ చుట్టూ ఉన్న కొండలు, దీవులను చూస్తే కలిగే ఆనందం వర్ణనాతీతం. సరస్సులో బోటింగ్ చేస్తే వచ్చే హుషారే వేరంటారు.. పర్యాటకులు. కాకతీయ రాజులు ప్రత్యేక శ్రద్ధ వహించి అభివృద్ధి చేసిన ఈ సరస్సు సుమారు 5వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. అధికారిక లెక్కల ప్రకారం.. 10వేలు, అనధికారికంగా మరో పదివేల ఎకరాలకు పైగా సరస్సు నీటితో వ్యవసాయ సాగుజరుగుతోంది. ప్రస్తుతం సరస్సు అభివృద్ధిపై తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రత్యేక దృష్టి సారించింది. బ్రిడ్జి మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలుచుకునే గిరీశ్ భరద్వాజ్ డిజైన్ చేసిన ఈ బ్రిడ్జి ఆధారంగా ప్రభుత్వం మరో బ్రిడ్జిని నిర్మించింది.


అటవీశాఖ పర్యావరణ ఉద్యానవనం


అడవిలో నుంచి లక్నవరం సరస్సుకు దారి

అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

- రక్షణతోపాటు ఉద్యోగం కల్పిస్తాం
- పదహారు చింతల్ తండా బాధితులకు ఎమ్మెల్యే దొంతి పరామర్శ

చెన్నారావుపేట: తల్లి దండ్రులను కోల్పోయి ఒంటరైన పిల్లలకు అండగా ఉంటానని, అధైర్య పడొద్దని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అభయమిచ్చారు. ఈ మేరకు వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని పదహారు చింతల్ తండాలో ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన శ్రీనివాస్, సుగుణ దంపతుల పిల్లలను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హంతకుడు నాగరాజుకు శిక్ష పడేలా చూస్తానని అన్నారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలకు ప్రభుత్వం తరపున ఖర్చుల నిమిత్తం రూ.4.25లక్షలు అందిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా అందేలా చూస్తామని తెలిపారు. పిల్లల చదువులు, వారి రక్షణకు ప్రభుత్వం బాధ్యత తీసుకుని, ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈసందర్భంగా బంధువులు, గ్రామస్తులు నిందితుడిని ఉరి తీయాలని, తనకు ఉద్యోగం ఇప్పించాలని బాధితురాలు దీపిక ఎమ్మెల్యే మాధవరెడ్డిని వేడుకున్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కలపెల్లి రవీందర్‌రావు, పీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ ఉన్నారు. ఇదిలా ఉండగా.. ఈ భయానక ఘటన నుంచి తండా ప్రజలు ఇంకా తేరుకోలేకపోతున్నారు. రెండు రోజులుగా సీఐ చంద్రమోహన్, ఎస్సై అరుణ్, జనగామ ఎస్సై రాజేష్‌కుమార్‌లు రేయింబవళ్లు తండాలో పికెటింగ్, బందోబస్తు ఏర్పాటు చేశారు.

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య


గణేశ్ (ఫైల్)

బచ్చన్నపేట: మండలంలోని పడమటి కేశ్వాపూర్ గ్రామానికి చెందిన గిద్దెల గణేశ్ (20) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గిద్దెల మేఘమాల, బాలయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో గణేశ్ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో పలు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో కొన్ని రోజులుగా బాధపడుతూ ఉండేవాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు, కుటుంబ సభ్యులు వెతకగా సమీప వ్యవసాయ భూమిలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుని కన్పించాడు. దీంతో గణేశ్ తండ్రి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలం వద్దకు ఎస్సై సతీష్‌కుమార్ చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ, బస్సు ఢీ: 15 మందికి గాయాలు


ప్రమాదస్థలంలో బస్సు, లారీ

ములుగు రూరల్: ములుగు జిల్లా పందికుంట –మల్లంపల్లి మధ్యలో శుక్రవారం ఉదయం లారీ, బస్సు ఢీ కొన్న ఘటనలో 15మంది గాయపడ్డారు. ప్రమాదానికి సంబంధించి, వివరాలిలా ఉన్నాయి.. ములుగు నుంచి హనుమకొండకు ఆర్టీసీ అద్దె బస్సు 33మంది ప్రయాణికులతో వెళ్తున్న క్రమంలో హనుమకొండ వైపు నుంచి వస్తున్న లారీ ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 15మంది ప్రయాణికులు, కండక్టర్‌కు గాయాలయ్యాయి. గాయాలైన వారిని అంబులెన్స్‌లో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒకరిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మిగతా వారు ములుగు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. లారీ డ్రైవర్ బోయపల్లి మహేశ్‌పై ములుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ విజయభాను తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ.. రోడ్డు మరమ్మతు పనుల్లో భాగంగా వన్‌వే ఏర్పాటు చేశారు. ఈక్రమంలో పందికుంట వద్ద లారీ డ్రైవర్ అతి వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌తో బస్సును ఢీ కొట్టాడు. ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణనష్టం జరగలేదని అన్నారు. గాయపడిన వారిని ఆర్‌ఎం ములుగు ఏరియా ఆస్పత్రిలో పరామర్శించినట్లు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ రీజనల్ మేనేజర్ భాను కిరణ్, వరంగల్ డీఎంలు సురేష్, మోహన్‌రావు, ఎస్టీఐ కుమార్ తదితరులు ఉన్నారు.

పనిచేసే అధికారులే ఏజెన్సీకి రావాలి

- ప్రజా దర్బార్‌లో మంత్రి సీతక్క
- రైతు భరోసా అందించాలని అధికంగా వినతులు


ప్రజా దర్బార్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ

కొత్తగూడ: పని చేయాలనే సంకల్పం ఉన్న అధికారులే ఏజెన్సీ గ్రామాలకు రావాలని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. మానుకోట జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్(గ్రీవెన్స్)లో ఆమె మాట్లాడారు. కొత్తగూడ, గంగారం, గూడూరు, మహబూబాబాద్, బయ్యారం మండలాల ప్రజలు మంత్రి సీతక్కకు వినతిపత్రాలు అందజేశారు. ఎక్కువగా రైతు భరోసా డబ్బులు అందించాలని వినతులు అందించారు. మండలంలో రికార్డుల ప్రక్షాళన సమయంలో ఫారెస్టు అధికారుల వల్ల పట్టాలు రద్దయ్యాయని, సర్వేలో రెవెన్యూ భూమి అని తేలినా హక్కు పత్రాలు ఇవ్వలేదని పలువురు వినతిపత్రం అందజేశారు. వెంటనే పట్టాలు జారీ అయ్యేలా చూడాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు మంత్రి సూచించారు. గంగారం, కొత్తగూడ మండలాల్లో కొత్తగా పోడు జరగకుండా, సాగులో ఉన్న పాత భూముల్లో వ్యవసాయానికి ఆటంకం లేకుండా చూడాలని జిల్లా ఫారెస్ట్ అధికారి బత్తుల విశాల్‌కు సూచించారు. గూడూరు మండలంలో ఈఎంఆర్ఎస్ పాఠశాలకు తమ భూములను బలవంతంగా లాక్కున్నారని బాధితులు వినతిపత్రం అందించగా వారికి ప్రత్యామ్నాయం చూపించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

స్టేజి దిగివచ్చి..

బయ్యారం మండలం గౌరారం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు వట్టం సైదమ్మ వినతిపత్రం ఇచ్చేందుకు ఇబ్బంది పడుతూ రావడం చూసిన మంత్రి సీతక్క స్టేజి దిగి ఆమె వద్దకు వెళ్లి వినతి పత్రం తీసుకున్నారు.

శభాష్ పోలీస్..


చంటిపాపను లాలిస్తున్న మహిళా పోలీస్

మంత్రి సీతక్కకు వినతి పత్రం ఇవ్వడానికి వచ్చిన ఓ దివ్యాంగురాలిని మహిళా పోలీసులు ఎత్తుకుని తీసుకెళ్లారు. అలాగే వినతిపత్రం ఇవ్వడానికి చంటిపిల్లతో ఓ తల్లి వచ్చింది. ఈక్రమంలో ఆమె వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లగా.. పాపను ఓ కానిస్టేబుల్ ఎత్తుకుని లాలించింది.

యువతను చైతన్యం చేయాలి..

యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా చైతన్యం చేయాలని అధికారులతో నిర్వహించిన సమీక్షలో సీతక్క సూచించారు. గంజాయి, మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని పోలీసు అధికారులకు సూచనలు చేశారు. అనంతరం వేలుబెల్లి సమీపంలోని కత్తెర్ల వాగుపై నిర్మించనున్న బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎస్పీ రాంనాథ్ కేకన్, ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ చిత్రామిశ్ర, ట్రాన్స్ కో ఎస్ఈ నరేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంజేపీలో ర్యాగింగ్

భరించలేక తప్పించుకున్న 19 మంది పిల్లలు

- ఐదు కిలోమీటర్ల దూరంలోని పాత ఎంజేపీకి రాక
- హాస్టల్ వద్ద ఆందోళనకు దిగిన తల్లిదండ్రులు
- ప్రిన్సిపాల్, టీచర్ల నిర్లక్ష్యంపై ఆగ్రహం


ఆందోళన చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

జనగామ: సీనియర్, జూనియర్ విద్యార్థుల ర్యాగింగ్.. గెస్ట్ టీచర్ల వెటకారం మాటలు.. చీటికి మాటికి ఫిర్యాదులతో విసిగిపోయిన 19 మంది విద్యార్థులు గోడదూకి తప్పించుకున్న ఘటన పెంబర్తి మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకులంలో శుక్రవారం జరిగింది. బాధిత విద్యార్థులు బాలాజీ, టి.సాత్విక్, వి.సకిరానందన్, ఎం.భరత్, బి.విగ్నేష్, కార్తీక్, వినయ్, ఎం.రామ్‌చరణ్, ఎస్.శ్రీచరణ్, టి.విగ్నేష్, సీహెచ్.రామ్‌చరణ్, రుషి, హఫీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా కేంద్రం ధర్మకంచ రైల్వేట్రాక్ ఏరియాలోని బాలుర ఎంజేపీలో విద్యార్థుల సంఖ్య ఎక్కువ కావడంతో 154 మంది(8, 9వ తరగతి)ని పెంబర్తి ఎంజేపీ(బచ్చన్నపేటకు చెందిన)లో 20 రోజుల క్రితం చేర్పించారు. ఇక్కడి సీనియర్, జూనియర్ విద్యార్థులు ఇటీవల వచ్చిన పిల్లలను ర్యాగింగ్ చేస్తున్నారు. వాటర్ సంప్‌లో అపరిశుభ్రత వాతావరణం కలిగేలా చేయడంతో వద్దని జనగామ నుంచి వెళ్లిన విద్యార్థులు వారించగా.. వారిని వేధింపులకు గురిచేయడం ప్రారంభించారు. సంప్ వాటర్ అపరిశుభ్రం కావడంతో పైపులైన్ వద్ద బకెట్లతో నీరు తెచ్చుకుని కాలకృత్యాలు తీర్చుకుంటున్నామని బాధిత విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. టీచర్లు సైతం ప్రేయర్‌లో జనగామ బాయ్స్ బ్యాడ్ అనేలా వ్యవహరించారని కన్నీటి పర్యంతమయ్యారు. గెస్ట్ టీచర్లు బూతులు మాట్లాడుతూ అవహేళన చేశారని ఆరోపించారు. ఈ విషయమై కొత్తగా వచ్చిన ప్రిన్సిపాల్‌కు చెప్పినా పట్టించుకోలేదని, ఏ సంఘటన జరిగినా తమను బాధ్యులను చేస్తున్నారని వాపోయారు. ఇక అక్కడ ఉండకూడదని నిర్ణయించుకుని తెల్లవారుజామున గోడదూకి కాలినడకన సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జనగామ పాత ఎంజేపీకి వచ్చేసినట్లు వివరించారు. పెంబర్తి గురుకులంలో భోజనం, కూర, చారు కూడా నాణ్యత లేక ఒక్క పూట కూడా తినలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. పిల్లలు పారిపోయారని సమాచారం అందుకున్న తల్లిదండ్రులు గురుకులం వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేను కొత్తగా వచ్చాను..



పెంబర్తి ఎంజేపీకి ఇటీవలే వచ్చాను. జూన్‌లో 154 మంది పిల్లలు జనగామ నుంచి వచ్చారు. గొడవలు జరిగే విషయం నాకు తెలియదు. అయినా రోజూ నిఘా ఉంటుంది. నైట్ వాచ్‌మన్ పర్యవేక్షిస్తారు. పిల్లలు ప్లాన్ చేసిన సంగతి పసిగట్ట లేక పోయాం. ర్యాగింగ్‌పై విచారణ చేయిస్తాం. అటువంటిది జరగలేదని అనుకుంటున్నాం. పై అధికారులకు సమాచారం ఇచ్చాం.

– చంద్రమౌళి, పెంబర్తి ఎంజేపీ ప్రిన్సిపాల్

క్రీడల్లో పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి

- కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి
- ముగిసిన రీజినల్ స్పోర్ట్స్ మీట్


విజేతలను అభినందిస్తున్న కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి

కాజీపేట అర్బన్ : క్రీడల్లో పోటీతత్వాన్ని పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాన్ని సాధించాలని కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి అన్నారు. కాజీపేట మండలం కడిపికొండలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయలో నిర్వహిస్తున్న తెలంగాణ, ఏపీ రీజినల్ స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ముగిసింది. రీజినల్ స్పోర్ట్స్ మీట్‌లో టేబుల్ టెన్నిస్ విభాగంలో అండర్–14 విభాగంలో బాయ్స్ అండ్ గర్ల్స్ కేవీ వాల్తేరు ప్రథమ స్థానంలో నిలిచారు, అండర్–17 విభాగంలో కేవీ వాల్తేరు బాలికలు, కేవీ తిరుపతి బాలురు ప్రథమ స్థానంలో, అండర్–19 విభాగంలో కేవీ విశాఖపట్నం బాలికలు, ఒంగోలు బాలురు ప్రథమ స్థానంలో విజేతలుగా నిలిచారు. పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ వరంగల్ విద్యార్థులు కె.ఆనంతశ్రీ, పి.శ్రీజ, సిహెచ్.సూర్య, కె.కోదండరామ్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. విజేతలను, జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ సుభాషిణి అభినందించారు. కార్యక్రమంలో కేవీ పీఈడీ కొర్ర శ్రీనివాస్, హైదరాబాద్ రీజియన్ పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్‌కు తరలించకపోతే తడాఖా చూపిస్తాం

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

నల్లబెల్లి: అశ్వారావుపేటలో ఎస్సైగా పనిచేసిన శ్రీరాముల శ్రీను ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన సీఐ జితేందర్ రెడ్డి, పోలీస్ సిబ్బందిని 24 గంటలలోపు ఉద్యోగాల నుంచి తొలగిస్తూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించకపోతే మా తడాఖా చూపిస్తామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరించారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేటలో శుక్రవారం ఎస్సై శ్రీను కుటుంబాన్ని ఎస్సీ, ఎస్టీ కమిషన్ బృందం పరామర్శించింది. శ్రీరాముల శ్రీను ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు శ్రీను చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. సీఐ, సిబ్బంది వేధింపులు, అవమానాలు భరించలేక ఎస్సై ఆత్మహత్య చేసుకున్నారంటే పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి ఎస్సై కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు వేధింపులకు పాల్పడిన వారిని శిక్షించాలని, ఆత్మహత్య చేసుకున్న ఎస్సై కుటుంబానికి న్యాయం చేయాలని వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేష్, ఎస్సీ, ఎస్సీ కమిషన్ సభ్యులు నూనవత్ రాంబాబు నాయక్, రేణికుంట్ల ప్రవీణ్, ఐనావత్ రాంబాబు, జిల్లా శంకర్, కొంకటి లక్ష్మీనారాయణ, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, మాజీ ఎంపీపీ బానోత్ సారంగపాణి, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్, జిల్లా అధ్యక్షుడు సురేష్, ఎబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్, నాయకులు చంద్రమౌళి, వైనాల అశోక్, గుండాల రాజకొరయ్య, వడ్లూరి రమేష్, బట్టు సాంబయ్య, బొట్ల నరేష్, మేడ రంజిత్, గాదపాక రాజేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల హెచ్చరిక

- బొగత వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు


పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండలంలోని చీకుపల్లి బొగత జలపాతం వద్ద ప్రమాదాలకు ఎవరూ ఇబ్బందులు పడొద్దని పోలీసుల హెచ్చరిక పేరుతో శుక్రవారం పోలీసులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు. జలపాతంలో మొసళ్లు ఉన్నాయని, హద్దు మీరకండి..అయిన వాళ్లకు దురం కాకండి.. అని ఫ్లెక్సీల్లో రాశారు.